క్లుప్తంగా

రూరల్ ఎంఈఓగా రంగారావు



కాకినాడ రూరల్: మండల విద్యా శాఖాధికారిగా కాకినాడ రూరల్ మండలానికి నియమితులైన తుమ్మల వెంకట సత్య రంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీడీఓ సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న ఆయన కాకినాడ రూరల్ మండలానికి పూర్తి అదనపు బాధత్యలు (ఎఫ్ఏసీ)తో ఎంఈఓగా వ్యవహరించనున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా గతంలో సేవలందించారు. రంగారావును ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు కలిసి అభినందనలు తెలియజేశారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పెద్దాపురప్పాడులో పారిశుధ్య పనులు తనిఖీ చేసి సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

కరప: మండలం పెద్దాపురప్పాడు గ్రామంలో గురువారం డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరిస్తున్నదీ, లేనిదీ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు తడి, పొడిచెత్త విడదీసి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, పంచాయతీ పని తీరుపై వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్‌ను అర్ధంచేసుకుని, సరియైన సమాధానం ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి వెళ్లి, దాని నిర్వహణను పరిశీలించి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచనలిచ్చారు. గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి కొత్తగా 184 పింఛన్లు

కరప: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా 184 మందికి (స్పౌస్) పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. కరపలో గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2019 నుంచి 2023 నవంబరు నెల 30వ తేదీ మధ్యన పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు మరణిస్తే, వారి భార్యలకు పింఛన్ మంజూరుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది జూన్ నెలలో దరఖాస్తులు తీసుకున్నట్టు తెలిపారు. అటువంటి వారికి శుక్రవారం పంపిణీ చేసే నెలవారీ పింఛన్లతో పాటు లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



వెంకటప్రసాద్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవదాయశాఖ తనిఖీదారు ఫణికుమార్

బోట్‌క్లబ్: ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక చైర్మన్‌గా జ్యోతుల వెంకట్ ప్రసాద్‌తో దేవదాయశాఖ తనిఖీదారులు వడ్డి ఫణికుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంతో పేరొందిన ఈ ఆలయాన్ని 1969లో జ్యోతుల చిన్న వెంకట్రావు నిర్మించారన్నారు.

చారిటీస్ ఇన్‌చార్జి కరస్పాండెంట్‌గా నీలకంఠం బాధ్యతల స్వీకరణ



బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చార్టీస్ ఇన్‌చార్జి కరస్పాండెంట్‌గా బళ్ల నీలకంఠం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన సామర్లకోట కుమారారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్య అందించడం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సంస్థ ఆదర్శాల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సాంకేతికతతో ముందడుగు వేస్తూ, సేవా దృక్పథంతో నిర్ణయాలు తీసుకుంటానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఈవోను సూపరింటెండెంట్ జె.సోమరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషారాణి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంగాధర్, జూనియర్ కళాశాల సిబ్బంది తదితరులు అభినందించారు.

వేగం.. పట్టని యంత్రాంగం!

- కోర్టు మార్గంలో రయ్.. రయ్‌మంటూ వాహనాలు
- ప్రమాదాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు
- స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరుతున్న కక్షిదారులు, అధికారులు, సిబ్బంది

కాకినాడ లీగల్: వాహనాల వేగానికి కళ్లెం ఉండడం లేదు. అది ఏ రోడ్డయినా సరే కోర్టులు, కలెక్టర్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లు ఉన్నాయన్న కనీస బెరుకు కూడా వాహనచోదకుల్లో కనిపించడం లేదు. ఈ క్రమంలోనే కాకినాడ కోర్టు మార్గంలో వేగ నియంత్రణ లేని వాహనాలు నిత్యం స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి.

కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్‌లో ఉన్న కోర్టు కాంపౌండ్‌కు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ జైలు, జిల్లా ట్రెజరీ కార్యాలయం ప్రధాన రహదారిని దాటుకుని లోపలికి వెళ్లాలంటే న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులతో నిత్యం రద్దీగా ఉండే ఈ కార్యాలయాలన్నీ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యాలయాలకు వచ్చి పోయే వారితో బిజీ బిజీగా ఉంటుంది. అయితే వార్ఫురోడ్డు నుంచి జిల్లా పరిషత్‌కు వచ్చే బస్సులు, కార్లు, లారీలు, ఇతర వాహనాలు ఈ రహదారి వెంబడే వేగంగా ప్రయాణిస్తుంటాయి. దీనివల్ల కోర్టులకు, రిజిస్ట్రార్ కార్యాలయానికి, ఇతర కార్యాలయాలకు వెళ్లే వారు వేగంగా వస్తున్న వాహనాలను తప్పించుకుని రహదారి దాటే సమయంలో తరచు ప్రమాదాలకు గురికావలసి వస్తోంది. ఈ వాహనాల రాకపోకలను దారి మళ్లించే మార్గం లేదంటున్నారు. ఈ కారణంగా రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునని న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులు చెబుతున్నారు. కోర్టు కాంపౌండ్‌లో 15 కోర్టులు ఉన్నాయి. ఈ కోర్టులకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు నిత్యం సుమారు రెండు వేల మంది వస్తూ వెళ్తూ ఉంటారు. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయానికి సుమారు 800 నుంచి వెయ్యి మంది వస్తుంటారు. సబ్‌జైలు, ట్రెజరీ కార్యాలయాలకు వచ్చేవారు సుమారు 500 మంది వరకు ఉంటారు. వీరందరికీ ఇదే ప్రధాన రహదారి కావడంతో వచ్చి పోయే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న వారిని స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

కూతవేటు దూరంలో పోలీసు స్టేషన్ ఉన్నప్పటికీ.. కూతవేటు దూరంలో కలెక్టర్ కార్యాలయం ఉన్నా.. ఈ చోరీ జరిగింది... ఆ ప్రమాదం సంభవించింది.. అని కొన్ని వార్తా కథనాల్లో వస్తుండడం చాలా మంది పాఠకులకు తెలిసిందే. కూతవేటు దూరంలో ఆ ఫలానా కార్యాలయం ఉండడానికీ.. చోరీ లేదా ప్రమాదం సంభవించడానికీ సంబంధం ఏమిటన్నది చాలా మందికి అర్థం కాదు. మనం పోలీసు స్టేషన్ ముందు నుంచో.. ఏదైనా ప్రధాన కార్యాలయం ముందు నుంచో వెళ్తున్నామంటే కొంద జాగ్రత్తగా వెళ్లాలని అనుకుంటాం.

అదేమీ లేదు.. ఎవరైతే నాకేంటి.. బండి నాది.. రోడ్డు నున్నగా ఉంది.. జోరుగా వెళ్లిపోవాలి... ఇదే నేటి ప్రయాణికులలో ఉన్న లక్ష్యం. అది రద్దీ స్థలమా.. ఎవరైనా అకస్మాత్తుగా వచ్చేస్తే వాహనాన్ని నియంత్రించగలమా.. అవతలి వారికో.. మనకో ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏమిటన్నది ఏమీ పట్టని రోజుల్లోకి అంతా వెళ్లిపోయారు. ఆ స్వభావాలకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని నియంత్రణ చర్యలు తీసుకోవలసి అవసరం ఎంతైనా ఉంది.



ప్రధాన రహదారిపై ఉన్న కోర్టు ప్రాంగణం

స్పీడ్ బ్రేకర్లు వేయాలి



ప్రధాన జంక్షన్‌ను ఆనుకుని ఉన్న కోర్టులకు, జిల్లా పరిషత్‌కు ప్రధాన రహదారి అయిన వార్ఫురోడ్డు నుంచి జిల్లా పరిషత్‌కు వచ్చే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు వేయాలి. అవి లేకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాల వల్ల నిత్యం అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి.

పెన్మెత్స రామచంద్రరాజు,
ఉపాధ్యక్షుడు, కాకినాడ బార్ అసోసియేషన్

ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలి



నిత్యం రద్దీగా ఉండే కోర్టు కాంపౌండ్ ప్రధాన రహదారి వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలి. కోర్టుకు, రిజిస్ట్రార్ కార్యాలయానికి, ట్రెజరీ కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు నిత్యం వందలాది మంది వస్తున్నారు. వీరు రహదారి దాటాలేంటే వేగంగా వచ్చే వాహనాలను చూసి భయపడుతున్నారు. ఇక్కడ ఉదయం కనీసం 9.30 గంటల నుంచి ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

వీరాబత్తుల రాజు, న్యాయవాది, కాకినాడ

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి రూ.లక్ష విరాళం



జేసీ రాహుల్ మీనాకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న కాకినాడ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళా హాకీ టోర్నమెంట్ నిర్వహణకు కాకినాడ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ రూ.లక్ష విరాళాన్ని జిల్లా జేసీ రాహుల్ మీనాకు గురువారం కలెక్టరేట్‌లో అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్ల నిర్వహణకు తమ అసోసియేషన్ మద్దతుగా నిలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే విరాళం అందజేశామన్నారు. కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.పద్మావతి, జీఎస్టీ ఆఫీసర్ అనిశెట్టి స్వామి, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎండీ బహదూర్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పులవర్తి సీతారామమూర్తి, నెల్లిపూడి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఆరుగురికి మూడు రోజుల చొప్పున జైలు, ఆరుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో 12 మందిని హాజరుపరచగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

- 5న ధర్నా విజయవంతం చేయాలని ప్రజా సంఘాల పిలుపు

కరప: వినియోగదారులను దోచుకునే విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీన తలపెట్టిన ధర్నాలో పాల్గొని, విజయవంతం చేయాలని ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. ప్రజావేదిక ఆధ్వర్యంలో గురువారం కరపలో విద్యుత్ చార్జీలు పెంపుదలను నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని, పెట్టిన మీటర్లను తొలగించాలని తదితర సమస్యల పరిష్కారానికి తలపెట్టిన ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ విద్యుత్ వినియోగదారులకు కరపత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘం నాయకురాలు సీహెచ్ రమణి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని గగ్గోలు పెట్టిన ప్రతిపక్షనాయకులు, తాము అధికారంలోకి వచ్చాక ఇక బాదుడు ఉండదని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టండన్న నారా లోకేష్, కూటమి నాయకులు పిలుపునిచ్చిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే విద్యుత్ బిల్లులు పెంచేసి, ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని ఆమె విమర్శించారు. ప్రజాసంఘం నాయకులు పి.వీరవేణి, ఆర్.వెంకటలక్ష్మి, ఎం.వరలక్ష్మి, సీహెచ్ వెంకటలక్ష్మి, బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరపలో కరపత్రాలు పంచుతున్న ప్రజా సంఘాల నాయకులు

జాతీయ మహిళల హాకీ టోర్నీకి సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: పట్టణంలో జరగనున్న హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడా మైదానం వేదికగా ఈ నెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు తగినట్టుగా పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఇందుకు ఆయా శాఖల అధికారులకు విధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ టోర్నీకి దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 500 మంది క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది పాల్గొంటారన్నారు. ఇప్పటికే 18 జట్లు కాకినాడకు చేరుకున్నాయని కలెక్టర్ వివరించారు. ఈ నెల 1వ తేదీ శుక్రవారం సాయంత్రం జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

క్రీడాకారులకు వసతి ఇలా

ఇప్పటికే చేరుకున్న 18 జట్లకు తోడు, మరిన్ని జట్లు శుక్రవారం ఉదయానికి కాకినాడ రానున్నాయని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులు, సహాయక సిబ్బందికి వసతికి సామర్లకోట ఈటీసీ, సర్వే ట్రైనీ సెంటర్, టీటీడీసీ క్యాంపస్, కాకినాడ అంబేద్కర్ హాస్టల్, మహిళా పాలిటెక్నిక్, జేఎన్టీయూ ఉమెన్స్ హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వసతి ఉన్న చోట నుంచి కాకినాడ క్రీడా మైదానానికి వాహనాల్లో క్రీడాకారులను తరలించనున్నట్టు తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హాకీ టోర్నీని సమర్థవంతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ జులై 30 నుంచి ఆగస్టు 30 వరకు నిరంతరం పని చేస్తుందన్నారు. దీనికి సెట్రాజ్ సీఈవో, భూగర్భ జలశాఖ డీడీ పర్యవేక్షణ అధికారులుగా ఉంటారన్నారు.

రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలి



రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: అన్ని రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. సాధారణ ప్రయాణికులకు రక్షణ కల్పించాలని, బోగీల సంఖ్య పెంచాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బాలం శ్రీనివాసు మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడలకు ఉండే పాసింజర్ రైళ్లతో పాటు అనేక రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చు చేశారని ఆరోపించారు. దీని కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎక్కడానికి సాధారణ బోగీల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రయాణికులు వేలాడుతూ రైళ్లలో ప్రయాణించాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ బోగీలకు సమానంగా సాధారణ బోగీల సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ధనవంతులు ప్రయాణం చేయడానికి అనేక రైళ్లు ఉన్నాయని, సాధారణ ప్రయాణికులు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ మేరకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు కరణం ప్రసాదరావు, కరణం గోవింరాజు, బాలం హరిబాబు, ఐటీ వీరబాబు, కె.పవన్, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

3న అష్టదేవత దర్శిని యాత్ర

బోట్‌క్లబ్: శ్రావణమాసం సందర్భంగా ఈ నెల 3వ తేదీ తెల్లవారు జాము 5 గంటలకు కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి అష్టదేవత దర్శిని యాత్ర ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని కాకినాడ డిపో మేనేజర్ భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో నిడదవోలు కోట సత్తెమ్మతల్లి, తాడేపల్లిగూడెం సర్వమంగళ అమ్మవారు, కోల్లేటికోట పెద్దింటమ్మ, భీమవరం మావుళ్లమ్మ, యనమదుర్రు పార్వతీ సమేత శక్తీశ్వరస్వామి, సత్త రామేశ్వరం రామలింగేశ్వరస్వామి త్రిలింగ క్షేత్రం, ఆచంట బాలాత్రిపుర సుందరిసమేత రామలింగేశ్వరస్వామి, పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దర్శనాలు ఉంటాయన్నారు. ఈ యాత్రపై ఆసక్తి ఉన్నవారు 73829 10869 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ వీఆర్ఎస్ ఆమోదం

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పనిచేస్తున్న పీడీయాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి విద్య స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ జీవో 86ను జారీ చేసింది. జూలై 31వ తేదీన వీఆర్ఎస్ అమలులోకి వచ్చినట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్యమూ ప్రధానం



సదస్సుకు హాజరైన విద్యార్థులు

- పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు

బాలాజీచెరువు: విద్యార్థినులకు విద్యతో పాటు ఆరోగ్యం కూడా ప్రధానమేనని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల మహిళా సాధికారిత సెల్, అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థినులు ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలని, జంక్‌ఫుడ్ వంటి వాటికి అలవాటు పడితే భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తప్పవని తెలిపారు. డాక్టర్ శ్రీదేవి క్యాన్సర్‌లోని రకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ పసుపులేటి టి.హరిరామప్రసాద్, వాణిజ్య విభాగాధిపతి లక్ష్మణరావు, పి.జ్యోతి, శ్రీదేవి, పద్మావతి, రాజమణిక్యం, చంద్రలీల, శ్రావణి, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై యువత అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా యువజన సర్వీసుల అధికారి టి.గోపి పేర్కొన్నారు. రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లోని మోహన్ విద్యా సంస్థల్లో గురువారం కేంద్ర ప్రభుత్వ క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వయంప్రతిపత్తి గల మై భారత్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధిని సాధించేందుకు యువత ముందు ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇండస్ట్రియల్ ప్రమోషనల్ ఆఫీసరు రాజేష్ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ కంపెనీలు అంటే ఏమిటో తెలియజేశారు. కార్యక్రమంలో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ ప్రతినిధి సుబ్బారావు, మై భారత్ సభ్యులు సత్యసూర్య, చంటిబాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

సామర్లకోట: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహనరావు కథనం ప్రకారం.. గురువారం స్థానిక కుమ్మర వీధిలో పది లీటర్ల సారాతో గుబ్బల నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. భాస్కర్‌నగర్‌లోని క్వారీ గోతులలో నాటు సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ మేరకు 20 లీటర్ల సారాతో జిత్తుగ అనిల్ కుమార్‌ను పట్టుకుని, కాకినాడ ఎక్సైజ్ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఎంవీవీబీ కుమార్, బీఎస్ఎన్ వరహాలు, సిబ్బంది ఉన్నారు.

వరలక్ష్మీ వత్రాలకు వేళాయె..

- నేడు శ్రావణ శుక్రవారం వ్రతాలు
- దాతలు, దేవస్థానం సహకారంతో పూజా సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు
- సుమారు 500 మంది భక్తులు వచ్చే అవకాశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో వరలక్ష్మీ వత్రాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఈ శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో రెండు శుక్రవారాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించాలని దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఇళ్ల వద్ద ఎక్కువగా చేసుకునే అవకాశం ఉండటంతో ఆ వారం ఆలయంలో ఏర్పాట్లు చేయడం లేదని దేవస్థాన అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 1, 15వ తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రావణ మాసం శుక్రవారంతో ప్రారంభం కావడంతో అంతకు ముందు బుధవారం ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ, అమ్మవారికి సారె, చీర ఏర్పాట్లతో పాటు లక్ష పసుపు కొమ్ముల నోము పూజలు నిర్వహించారు. దాని కారణంగా మొదటి శుక్రవారం దేవస్థానం నిర్వహించలేదు. ఇక ఐదో శుక్రవారం అమావాస్య రోజు రావడంతో ఆ రోజు కూడా సామూహిక పూజలు చేయడం లేదని దేవస్థాన అధికారులు తెలిపారు. రెండో శుక్రవారం ప్రారంభం అయ్యే పూజలకు సంబంధించి ఆలయాన్ని మామిడి తోరణాలతో భక్తులకు స్వాగతం పలికే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో మామిడి తోరణాలు కడుతున్న సిబ్బంది

దేవస్థానంలో జరిగే సామూహిక వ్రతాలతో మంచి ఫలితాలు వస్తాయని పండితుల సూచనల మేరకు సామూహిక వ్రతాలకు ఎక్కువగా భక్తులు హాజరవుతున్నారు. ఈ మేరకు వ్రతాల్లో పాల్గొనే భక్తుల వ్రతాలకు కావాల్సిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫోటో, ప్రసాదం దాతలు, దేవస్థానం నుంచి ఏర్పాట్లు చేశారు. వరలక్ష్మీ వ్రతాలకు వచ్చే మహిళలు కేజీన్నర బియ్యం, పంచపాత్ర, కలశ చెంబు, బ్లౌజ్ మాత్రమే తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లించడం జరుగుతుందని వారు తెలిపారు. సామూహిక వ్రతాల్లో తమ పేర్లు నమోదు చేయించుకున్న మహిళలు శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహించే వ్రతాలకు హాజరు కావాల్సి ఉంటుంది. పూజల్లో పాల్గొనే భక్తులకు శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 500 మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని దేవస్థాన అధికారులు అంచనా వేస్తున్నారు.

100 రెట్ల ఫలితం ఉంటుందనే..



ఇళ్ల వద్ద చేసుకునే వ్రతాల కంటే దేవస్థానంలో చేసుకునే సామూహిక వ్రతాల్లో పాల్గొనడం ద్వారా 100 రెట్లు ఫలితాలు ఉంటాయనే ప్రచారం ఉంది. ఈ విషయాన్ని అనేక మంది ఆధ్యాత్మిక వేత్తలు, వేద పండితులు తెలియజేస్తున్నారు. పూజైన తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇవ్వాలి. సామూహిక వ్రతాల్లో ఎక్కువ మంది ముత్తైదువులను చూసే అవకాశం ఉంటుంది. దేవాలయంలో వేదపండితులు చేసే సహస్రనామ పారాయణతో మంచి ఫలితం వస్తుందనే నమ్మకం ఉంది.

– శ్రీరంగం మాధవి, గృహిణి, పెద్దాపురం

ఏర్పాట్లు పూర్తి

సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం మొదటి అంతస్తులో భక్తులు నిండిపోతే, దిగువ భాగంలో భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి భక్తురాలికి వేదపండితుల మంత్రాలు వినిపించే విధంగా చర్యలు తీసుకున్నాం. భక్తులు విఘ్నేశ్వర పూజకు బియ్యం, ఉద్దరిణి, కలశ చెంబు, జాకెట్ ముక్క మాత్రమే తీసుకు రావాలి. మిగిలిన పూజా సామగ్రి దేవస్థానం, దాతల సహకారంతో ఏర్పాటు చేశాం. వ్రతాల్లో పాల్గొనే భక్తులు ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలి.

– బళ్ల నీలకంఠం,
పంచారామ క్షేత్రం ఈఓ, సామర్లకోట